క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గొర్రె మృతి



కమలాపూర్: విద్యుదాఘాతంతో గొర్రె మృతిచెందింది. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన మారం రమేష్ తన గొర్రెలను గురువారం ఉదయం మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే మండలంలోని పంగిడిపల్లి మార్గంలో గొర్రెలు పచ్చిక మేస్తుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగిలి గొర్రె అక్కడికక్కడే మృతి చెందగా మరో రెండు గొర్రెలు విద్యుదాఘాతానికి గురయ్యాయి. విద్యుత్‌శాఖ అధికారులు ఆదుకోవాలని బాధితుడు రమేష్ కోరారు.

చైర్మన్ పదవికి 'గందె' రాజీనామా

పరకాల: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో పాటు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఓటమి చెందటంతో పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పదవికి గందె వెంకటేశ్వర్లు రాజీనామా చేశారు. గత నాలుగేళ్లుగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయన తన పరిపాలన సమయం పూర్తికాకముందే రాజీనామా చేయడం పట్ల భక్తులు విస్మయానికి గురయ్యారు. 10 రోజుల్లో ప్రారంభం కానున్న షష్టి జాతర, నెల రోజుల్లో జరగనున్న శివరాత్రి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించాల్సిన సమయంలో ఆయన రాజీనామా చర్చనీయాంశంగా మారింది.

మిత్రుని కుటుంబానికి చేయూత



ఆత్మకూరు: మండల కేంద్రంలో ఇటీవల పరికిరాల సౌందర్య అనారోగ్యంతో మృతి చెందగా గురువారం బాధిత కుటుంబాన్ని ఆమె కుమారుడి బాల్యమిత్రులు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగపురి మహేష్, బయ్య శ్రీధర్, మూల ప్రవీణ్, రేవూరి సుధాకర్‌రెడ్డి, మునుకుంట్ల సతీష్, రాసమల్ల పరమేశ్వర్, బట్టు రవి, అశోక్, మల్లేష్, సంతోష్, మోహన్‌రాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖకు అభినందనల వెల్లువ



దామెర: రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖకు అభినందనలు వెల్లువెత్తాయి. మండలంలోని పసరగొండకు చెందిన, గూడెప్పాడ్ ఏఎంసీ వైస్ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు గజ్జి విష్ణు హైదరాబాద్‌లోని సురేఖ నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సబ్సిడీపై ఎల్ఈడీ బల్బ్‌లు

హసన్‌పర్తి: 66వ డివిజన్ హసన్‌పర్తిలో సబ్సిడీపై ఎల్ఈడీ బల్బ్‌లు అందజేస్తున్నట్లు కార్పొరేటర్ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో మీటరుపై రూ.125 చెల్లిస్తే మూడేళ్ల వారంటీతో ఐదు బల్బ్‌లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆసక్తి గల వారు కరెంట్ బిల్లు రసీదు తీసుకుని రావాలని సూచించారు. బంజరుదొడ్డి, సత్యం ఆస్పత్రి, శివాలయం వద్ద కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అనిల్‌కుమార్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల పరిశోధకుడు ఏ.అనిల్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇంపాక్ట్ ఆఫ్ డిజిటల్ మార్కెటింగ్ ఆన్ కన్స్యూమర్ బిహేవియర్ - ఏ స్టడీ ఆన్ ఎఫ్ఎంసీజీ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి అనిల్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్‌రావు పర్యవేక్షణలో అనిల్‌కుమార్ తన పరిశోధనను పూర్తిచేశారు. వరంగల్‌కు చెందిన ఆయన ప్రస్తుతం పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడులు

హసన్‌పర్తి: మండలంలోని సీతానాగారంలో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,810 నగదు, నాలుగు ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భోజన కార్మికులకు తప్పని తిప్పలు

- శిథిలమైన పాఠశాల భవనాలే దిక్కు
- ప్రతిపాదనలకే పరిమితమైన మధ్యాహ్న భోజన గదుల నిర్మాణ ప్రక్రియ



శిథిలమైన భవనంలో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పరకాల: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీ చేసే కార్మికులకు వంట చేసేందుకు పక్కా భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఓ వైపు పాఠశాలలో సమయానికి భోజనం అందించాలని అధికారుల ఒత్తిళ్లు, మరోవైపు వర్షం కురుస్తుండటంతో వంటలు ఎక్కడ చేయాలో తెలియక అయోమయం పడుతున్నారు. కనీస సదుపాయాలు లేకపోవడంతో శిథిలమైన పాఠశాల భవనాల్లో వంటలు చేస్తూ నెట్టుకొస్తున్నారు.

పట్టణంలో అధ్వాన పరిస్థితి

15 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనం పథకం అమలు జరుగుతున్నా పట్టణంలోని ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాలలో వంట గది నిర్మాణం జరుగలేదు. దింతో మధ్యాహ్న భోజన తయారీ కోసం పాఠశాల ఆవరణంలో, శిథిలమైన భవనాల్లో వంట చేస్తున్నారు. వర్షాకాలంలో బయట వంట చేయలేని పరిస్థితి ఉండడంతో శిథిలమైన భవనాల్లో వంటలు చేస్తే ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్న భోజన వంటల కోసం ప్రత్యేక గదులు, షెడ్లు నిర్మించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పలుమార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదు. గదుల నిర్మాణ ప్రక్రియ ప్రతిపాదనలకే పరిమితమయ్యాయని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. వేసవికాలం, వర్షాకాలం అనే బేధం లేకుండా వంటలు చేసేందుకు కష్టాలు పడుతున్నామని వంట షెడ్లు, ప్రత్యేక గదులు నిర్మించాలని కోరారు.

వంటగది నిర్మాణం చేపట్టాలి



విద్యార్థులకు సమయానికి భోజనం అందించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం తుపాను కారణంగా వర్షం కురుస్తుంది. ఈ పరిస్థితిలో బయట వంటలు చేయలేకపోతున్నాం. శిథిలమైన భవనంలో వంట చేద్దామంటే ఎప్పుడు కూలుతుందోనని భయమేస్తోంది. ఇన్ని ఇబ్బందులు పడుతున్నా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పలుమార్లు అధికారులకు సమస్యను విన్నవించినా ప్రతిపాదనలు చేశామని చెప్పారు కానీ ఇప్పటి వరకూ వంటగది నిర్మాణం చేపట్టలేదు. నూతనంగా కొలువుదీరిన ప్రభుత్వం అయినా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. కార్మికుల కష్టాలు తీర్చాలని కోరుకుంటున్నాను.

- రమ, మధ్యాహ్న భోజన కార్మికురాలు

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబురాలు



శాయంపేట : బాణసంచా కాలుస్తున్న నాయకులు



వేలేరులో..



శాయంపేట : స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

ఎల్కతుర్తి: హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పొన్నం ప్రభాకర్‌గౌడ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా భీమదేవరపల్లి మండలం ములకనూర్‌లో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసి రహదారిపై బాణసంచా కాల్చి సంబురాలు చేశారు.

వేలేరులో..

వేలేరు : తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండల వ్యాప్తంగా ఆపార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. వేలేరు మండల కేంద్రంలో ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్ ఆధ్వర్యంలో రుద్ర రామేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బైక్ ర్యాలీ చేపట్టి అంబేడ్కర్ విగ్రహం ఎదుట 101 టెంకాయలు కొట్టారు. పీచర గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకట్వేర్లు, నాయకులు పోలు తిరుపతి, ఎల్లయ్య, వెంకటేశ్, నగేష్, నాగరాజు, సలీం, మాలిక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం సంబురాలు జరిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి నినాదాలు చేశారు. మండల స్థాయి అధికారులతో పాటు ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతల రవిపాల్, దుబాసి కృష్ణమూర్తి, గాజె చిరంజీవి, మామిడి సుదర్శన్, వడ్డెపల్లి శ్రీనివాస్, మారెపల్లి రాజు, కట్టయ్య, ప్రపంచరెడ్డి, రఫీ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీకమాస పూజలు



మెట్టుగుట్టపై ఆకాశదీపం వెలిగిస్తున్న అర్చకులు



కాజీపేట: పుష్పాలంకరణలో మల్లన్న

మడికొండ: 46వ డివిజన్ మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం సంప్రోక్షణ అనంతరం స్వామివారికి ప్రభాతసేవతో వైభవంగా గోపూజ, అఖండ దీపారాధన, ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రామాలయంలో స్వామివారికి విశేష అర్చనలు జరిపించారు. సాయంకాలం హరిహరులకు ఆకాశ దీపోత్సవం, శివాలయంలో ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి తెలిపారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మల్లన్నకు లక్షపూలతో అభిషేకం

కాజీపేట: కార్తీకమాసం చివరి గురువారం కావడంతో కాజీపేట పట్టణంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో భక్తులు స్వామి వారికి లక్ష పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, శివ - శక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు పుష్పాభిషేకం జరిపించారు. పూజలు ముగిసిన అనంతరం మహిళలు దీపారాధన చేశారు.

రైతు బంధుసమితి కోఆర్డినేటర్ రాజీనామా

ఆత్మకూరు: రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ఎన్కతాల్ల రవీందర్ తన పదవితో పాటు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటనలో తెలిపారు. అక్కంపేట గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చడానికి ప్రభుత్వం పూనుకున్నందున సంతోషం వ్యక్తం చేస్తూ తాను తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

పూర్ణ పుష్కలంబ సమేత అయ్యప్ప కల్యాణం



కాజీపేటలో అయ్యప్పస్వామి కల్యాణ వేడుకలు



కరీమాబాద్‌లో అయ్యప్పస్వామి శోభాయాత్ర

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని అయ్యప్పస్వామి కల్యాణ వేడుకలను పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గురువారం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంతమల్లయ్య శర్మ ఆధ్వర్యంలో పుర్ణాపుష్కలంబ సమేత అయ్యప్పకు వివాహ వేడుకలు జరిపించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారులు భారీగా తరలివచ్చి వివాహ వేడుకలను తిలకించారు. అయ్యప్పస్వాములు, భక్తులకు అన్నపూర్ణ భవనంలో భిక్ష ఏర్పాటు చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న అరూరి రమేష్

హసన్‌పర్తి: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్పొరేటర్లు, నాయకులకు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సూచించారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, జక్కుల రజిత, సిరంగి సునీల్‌కుమార్, ఆవాల రాధికారెడ్డి, జన్ను షీభారాణి, గుగులోతు దివ్యారాణి, సరోజన, రవినాయక్, అరుణ, తూర్పాటి సులోచన, మాజీ కార్పొరేటర్లు జక్కుల వెంకటేశ్వర్లు, రాజు నాయక్, రైతుబంధు కోఆర్డినేటర్ సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న బీసీఐ సిబ్బంది

శాయంపేట : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని బీసీఐ సమన్వయ కర్త తిరుపతి అన్నారు. ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్, బీసీఐ ప్రాజెక్టు వారు మండలంలోని నేరేడుపల్లిలో గురువారం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల కార్మిక చట్టం ఐఎల్ఓ 138 ప్రకారం 14 సంవత్సరాలలోపు పిల్లలతో వ్యవసాయ పనులు చేయించొద్దని అన్నారు. 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు పురుగుల మందు పిచికారి చేసే సమయంలో ఆ ప్రాంతానికి వెళ్లొద్దని, అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించాలని కోరారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం సుచరిత, బీసీఐ ఫీల్డ్ ఫెసిలిటేటర్ షేక్ గౌస్, సునీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న జగదీశ్వర్

కమలాపూర్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష ప్యాడ్లు అందించారు. ఈ సందర్భంగా ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో 103 మందికి, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో 73 మంది చొప్పున మొత్తం 176 మంది విద్యార్థులకు ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) పరీక్ష ప్యాడ్లు అందించారు. ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల విలువ గల పరీక్ష ప్యాడ్లను పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఓదెల మల్లయ్య, ప్రఫుల్లాదేవి, బోధన సిబ్బంది, హెచ్ఎం పవన్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్సై దేవేందర్

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వ్యక్తులు ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ అప్లికేషన్ ఆధారంగా పోలీస్‌లు స్వాధీనం చేసుకొని బాధితులకు అందించారు. ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తహరాపూర్ గ్రామానికి చెందిన కొమ్ముల సమ్మయ్య, పోచారం గ్రామానికి చెందిన కోలేపాక రాకేష్, శాయంపేట గ్రామానికి చెందిన అకినపల్లి అరుణ్‌కుమార్ ఇటీవల సెల్‌ఫోన్‌లు పొగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ-కాప్స్ రైటర్ రతిష్ సీఈఐఆర్ అప్లికేషన్ గురించి బాధితులకు వివరించగా వారు నమోదు చేశారు. ఐటీకోర్ సహాయంతో ట్రేస్ చేసి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

కుంకుమేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న వెంకట్‌రెడ్డి దంపతులు

పరకాల: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా పట్టణానికి చెందిన గంజి పద్మ-వెంకట్‌రెడ్డి దంపతులు భక్తులకు మహా అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కలకలలాడింది. ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మ, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవం



కమలాపూర్ : శివలింగ ప్రతిష్ఠాపన చేస్తున్న వేదపండితులు



దామెర : యంత్రస్థాపన నిర్వహిస్తున్న పండితులు

కమలాపూర్: మండలంలోని ఉప్పల్ చిన్నచెరువు మత్తడి ప్రాంతంలో నిర్మించిన శ్రీ మహాలింగమయ్యస్వామి దేవస్థానంలో గురువారం శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన దేవతాలింగ జీర్ణోద్ధారణ పూర్వక నూతన గణేశ, సుబ్రహ్మణ్య, నవగ్రహ, వీర బ్రహ్మేంద్ర, ఆంజనేయ, సాయినాథ, శిలావృషస్తంభ, శిఖర, ధ్వజస్తంభ, పార్వతీ సహిత అష్టోత్తరశత (108) శివలింగ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. అంతకుముందు నిత్యనిధి, ప్రసాద ప్రదక్షిణ, ఆలయ ప్రవేశం, పీఠపూజ, గర్భన్యాసం, రత్నన్యాసం, యంత్రన్యాసం, నిత్యాప్రాసన, రుద్ర హవనం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూసాల ప్రకాశం, అర్చకులు, వేద పండితులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర: మండలంలోని వెంకటాపూర్‌లో శివాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న వేడుకల్లో భాగంగా ఉదయం యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మహోత్సవం నిర్వహించారు. అనంతరం అర్చన, అభిషేకాలు నిర్వహించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేడుకలకు మండల వ్యాప్తంగా శివభక్తులు అధిక సంఖ్యలో హాజరై శివుని కృపకు పాత్రులయ్యారు. మహిళలు పెద్దెత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ చైర్మన్ పున్నం సంపత్, కమిటీ సభ్యులు బాబురావు, శ్రీధర్, కైలాష్, అంకూష్, సంపత్‌కుమార్, నాగరాజు, రజినీకాంత్, రాజు, సదాశివుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామంగా 'అక్కంపేట'



ఆత్మకూరు: రెవెన్యూ గ్రామంగా మండలంలోని అక్కంపేట గ్రామాన్ని ప్రకటించనున్నట్లు కలెక్టర్ సిక్తాపట్నాయక్ తెలిపారు. మండలంలోని అక్కంపేటలో గురువారం సర్పంచ్ విజయ హంశాల్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ గ్రామం చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ.. జయశంకర్ స్వగ్రామం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ప్రకటించనుండడం సంతోషదాయకమన్నారు. అక్కంపేటలో 3,432 మంది జనాభా, 857 కుటుంబాలు ఉన్నాయన్నారు. 1981లో పెద్దాపూర్ గ్రామపంచాయతీ నుంచి అక్కంపేటను విభజించి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారన్నారు. రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ చేతన్‌కుమార్, ఎంపీటీసీ ఇందిర పాల్గొన్నారు.